

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## పెద్దకొడుకు

"**అమ్మా నీ పెద్దకొడుకు రెక్కలు** ముక్కలు చేసుకుని వచ్చాడు. పాపం పాలో, నీళ్ళో ఇవ్వు" వరండాలో కూర్చుని పకోడీలు తింటూ తనని చూసి అరిచిన చెల్లెల్ని చూస్తే మింగేయాలన్నంత కోపం వచ్చింది రమేష్‌కి.

"ఏంటీ? నోట్లు లెక్క పెట్టీ పెట్టీ రెక్కలు ముక్కలయ్యాయ్యా?" లోపల నుంచి వచ్చిన తమ్ముడు చెల్లెలి ప్లేట్‌లోని పకోడీని నోట్లో వేసుకుంటూ నవ్వాడు.

తనకోసం మంచి నీళ్ళు తెస్తున్న తల్లి కానీ, మొక్కలకి నీళ్ళు పోస్తున్న తండ్రికానీ వాళ్ళని వారిస్తారేమో అని రమేష్ ఎదురుచూసాడు. కానీ వారెవరూ ఆ మాటలని పట్టించుకోలేదు.

"అలా ఊరికినే కూర్చుని వెకిలి జోక్స్ వేయకపోతే బేంక్ పి.ఓ ఎగ్జామ్స్‌కి నోటిఫికేషన్ వచ్చింది రాయచ్చుగా?" తల్లి ఇచ్చిన నీళ్ళగ్లాస్‌ని అందుకుంటూ అడిగాడు తమ్ముడ్ని.

"ఏంటీ? పి.ఓ ఎగ్జామా? హలో, నేను నీలా బి.కాం కాదు. బి.టెక్ అది గుర్తుంచుకో. వెధవ సలహాలివ్వకు." బి.టెక్ బయోటెక్ చదివి ఏడాదిగా ఉద్యోగం లేని తమ్ముడు కోపంగా చెప్పాడు.

వాడిని మందలిస్తారేమో అని మళ్ళా తల్లితండ్రులవైపు చూసాడు రమేష్. ఉహూ.. తల్లి ముసిముసిగా నవ్వినట్లుగా కూడా అనిపించింది.

"దానికి ఏం తక్కువ జీతం రాదు. నెలకి ముప్పైవేల పైనే వస్తుంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్" నచ్చ చెప్పబోయాడు.

"వాడికి ఆసక్తిలేదంటున్నాడు కదా. వదిలేయరా. చిన్నాడిది టెక్నికల్ బ్రెయిన్. నీలాగా చిట్టా పద్దులు చూసే జాబ్ చేయలేడు." తండ్రి వారించాడు.

అవసరం లేక పోయినా చెల్లెలు కిసుక్కున నవ్వింది.

రమేష్ చిన్నగా నిట్టూర్చాడు. తనకి సైన్స్ మీద ఆసక్తి లేదని ఇంటర్లో ఆర్ట్స్ తీసుకుని బీ.కామ్‌లో చేరగానే ఇంట్లోని వారందరికీ చులకన అయ్యాడు. మొదటి రెండు అవకాశాల్లో సి.ఏ పూర్తికాకపోయేటప్పటికి ఇంకా చులకనయ్యాడు. తమ్ముడు ఇంజనీరింగులో

చేరాక అది ఇంకా ఎక్కువైంది. తమ్ముడు, చెల్లి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నా అమ్మా నాన్నా అదేం అనరు. తనకి నాయనమ్మ పోలిక కాబట్టి అమ్మకి తనంటే అయిష్టం అనికూడా రమేష్‌కి అనుమానం.

"నోట్లు లెక్కపెట్టడమే కానీ, ఒక్క ఐదువందలు ఇవ్వరా కుర్తా కొనుక్కుంటాను అని నెలరోజులనుంచి అడుగుతున్నా ఇవ్వట్లేదు. ఒట్టి పీనాసి" చెల్లి ఫిర్యాదుగా చెప్పింది.

"జీతం రాగానే మొత్తం నాన్నకే ఇస్తున్నాను. నాదగ్గర లేవని చెప్పానుకదా! " గొణిగాడు రమేష్.

"నాన్న నీకు ప్రతీనెల ఐదు వందలు ఇస్తారుగా? "

"అది నా ఖర్చులకి కావాలిగా?"

"ఇంట్లో తినివెళ్తావ్. ఇంటికొచ్చి తింటావ్. నీకు ఖర్చులేముంటాయిరా?" చెల్లి దబాయింపుగా అడిగింది.

మళ్ళీ తల్లితండ్రుల రియాక్షన్ కోసం చూసాడు కానీ వాళ్ళు స్పందించలేదు.

"ఆగవే నాకు జాబ్ రానీ. నెలకి వెయ్యిరూపాయలిస్తా" తమ్ముడు అభయం ఇచ్చాడు.

"మీ మామగారు ఫోన్ చేసారు. పండక్కి నిన్ను పంపమన్నారు."

పకోడీల ప్లేట్ అందిస్తూ తల్లి చెప్పింది. "మంచిరోజు చూసి కోడలిని తెచ్చి దింపమను. అంతేకానీ నువ్వెళ్ళి తెస్తానని చెప్పకు."

"అనవసరంగా సెలవు వేస్ట్ చేసుకోకు. పండగ ముందురోజు వెళ్ళి తర్వాతి రోజు వచ్చెయ్" తండ్రి ఆజ్ఞాపించాడు.

మామగారు బేంక్‌కి ఫోన్ చేసారని కానీ, తను అప్పటికే రిజర్వేషన్ చేయించుకున్నాడని కానీ రమేష్ చెప్పలేదు.

"అమ్మా! బావొచ్చాడు" గేటుకి అల్లుకున్న జాజితీగ వంచి పూలుకోస్తున్న మరదలు ఓ కేక పెట్టి రమేష్ చేతిలోని బేగ్ అందుకుంది.

ఒక్క ఉదుటున బయటికి పరిగెత్తు కొచ్చిన కుముద భర్తని చూసి సిగ్గుగా నవ్వింది.

"అమ్మా, నాన్న, తమ్ముడు, చెల్లాయ్ అంతా కులాసానేనా బాబూ?" మంచి నీళ్ళ గ్లాస్ ఇచ్చి అత్తగారు పరామర్శించింది.

"అంతా బావున్నారండీ" వినయంగా జవాబు చెప్పాడు రమేష్.

"అల్లుడికి ఫేన్ వెయ్యి. ఆరుగంటలు బస్సు ప్రయాణం. చిన్నమ్మాయ్ వేణ్ణీళ్ళు పెట్టు. బావ స్నానం చేస్తాడు" మామగారు వచ్చి రమేష్ ప్రక్కన కూర్చుని లోకాభిరామాయణం మాట్లాడసాగాడు.

"బావా బాగున్నారా? పెళ్ళిలో మీతో మాట్లాడటమే కుదరలేదు" బయట నుంచి పుస్తకాలతో వచ్చిన బావమరిది అభిమానంగా పలకరించాడు.

"బాగున్నా. నువ్వేం చేస్తున్నావు?"

"బి.టెక్ అయిపోయింది బావా. సివిల్స్ రాయాలని ఉంది. మీకు తెలుసుగా కోచింగ్, పుస్తకాలు, మెటీరియల్... సివిల్స్ ఖరీదైన వ్యవహారం. నాన్న సపోర్ట్ చేయలేరు. ఏం చేయాలో అర్థం కావటం లేదు" బావమరిది బాధగా చెప్పాడు.

"బేంక్ పి. ఓ ఎగ్జామ్‌కి నోటిఫికేషన్ పడింది. అప్లై చేయకపోయావా? సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్నావు కాబట్టి తేలిగ్గా పాసైపోతావు. సివిల్స్ క్వాలిఫై అయ్యేదాకా బేంక్ జాబ్ చేయచ్చు" జంకుగానే చెప్పాడు రమేష్.

బావమరిది మొహం ఆనందంతో విప్పారింది. రమేష్ చేతిని పట్టుకుని చెప్పాడు.

"మంచి సలహా ఇచ్చారు బావా. వెంటనే అప్లై చేస్తాను. దేవుడి దయవల్ల బేంక్ జాబ్ వస్తే, జాబ్ చేసుకుంటూ సివిల్స్‌కి ప్రిపేరవుతా. నాన్నకి బర్డెన్ ఉండదు."

"అల్లుడంటే ఇంటికి పెద్దకొడుకు" మామగారు ఆప్యాయంగా చెప్పాడు.

"నన్ను ఎప్పుడు తీసుకెళ్తున్నారు?" ఆ రాత్రి కుముద భర్తని అడిగింది.

"నాకు ట్రాన్స్‌ఫర్ అయ్యేలా ఉంది. రెండు మూడు నెలలు ఓపిక పట్టు. ఒకేసారి ఆ ఊరికే తీసుకెళ్తాను" ఆలోచనగా చెప్పాడు రమేష్.

"ట్రాన్స్‌ఫరా? మరి పెళ్ళిచూపుల్లో ఉమ్మడి కాపురంలో ఉండడానికి అభ్యంతరం లేదా అని అడిగారు?"

"మొన్నే తెలిసింది. ఇంకా అమ్మవాళ్ళకి కూడా చెప్పలేదు"

కుముదకి మనసులో సంతోషంగా అనిపించింది.

"నా కోడలు మామూలుది కాదు. పెద్ద మాయలాడి. మావాడ్ని బుట్టలో వేసుకుని మా ఊరినుంచి దూరంగా ట్రాన్స్‌ఫర్ చేయించింది. కాపురానికి అక్కడికే వెళ్ళింది. మా చవటే వెళ్ళి తీసుకొచ్చాడట. మేమంటే ఎంతో ప్రేమున్న వాడు ఇప్పుడు వారానికి ఒకరోజు కూడా ఫోన్ చేయడంలేదు. జీతంలోంచి రూపాయి కూడా ఇవ్వడం లేదు. ఎంతో కష్టపడి కొడుకుని కని పెంచి పెద్ద చేసి ఇలా దారాదత్తం చేసాం ఆ బ్రహ్మరాక్షసికి" రమేష్ తల్లి అడిగిన వాళ్ళకి అడగని వాళ్ళకీ కోడలి చెడ్డతనం, కొడుకు మెతకదనం గురించి చెప్తూనే ఉంది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story